మందారమాల
సత్యం మందపాటి

# ఆరుద్ర ముద్ర



నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల



కూనలమ్మ పదాలు
వేనవేలు రకాలు
ఆరుద్రదే వ్రాలు --- అంటాడు శ్రీశ్రీ.
కూనలమ్మ పదాలు
లోకానికి సవాలు
ఆరుద్ర చేవ్రాలు --- అంటాడు శ్రీశ్రీ.
కూనలమ్మ పదాలు
కోరుకున్న వరాలు
ఆరుద్ర సరదాలు --- అంటాను నేను, అంటాడు శ్రీశ్రీ.

(చిత్రం:డా.దారా సురేంద్ర)

‘ఆరుద్ర ఎప్పుడూ చాల మంచి పాట వ్రాశానని అనలేదు. అనుకోలేదు. అలా అన్నదీ, అనుకున్నదీ అభిమానులే. వారికే చివరికి కవి (ఆరుద్ర) ఋణగ్రస్థుడు’ అంటారు శ్రీమతి కె. రామలక్ష్మి.

‘1965 జనవరి నెలనుండి ఈ పన్నెండు సంపుటాల రచనకు ఉపక్రమించాను. ప్రతి సంపుటిలోని పుటల పరిమితి ముందుగానే నిర్ణయం కావటం వల్ల ప్రతి ప్రకరణలో తెలిసిన ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా విరివిగానే రాసినా చివరికి కుదించటం తప్పనిసరి అయింది.

సమగ్రత దెబ్బతినకూడదని సంపుటాల సంఖ్యని పెంచి అదనపు యుగాలనూ, ఉపయుగాలను చేర్చవలసి వచ్చింది. ప్రచురణకి ముందే ప్రజలకిచ్చిన వాగ్దానానికి భంగం లేకుండా పన్నెండు సంపుటాలనూ వరుసగా ప్రచురించటం జరిగింది' అన్నారు ఆరుద్ర తన మాటల్లోనే.

అలా పన్నెండు సంపుటాలు అనుకున్న, 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' పదమూడు సంపుటాలుగా వెలువడింది. తెలుగు సాహిత్యం గురించి సమగ్రంగా తెలుసుకోవాలన్న కుతూహలం వున్న నా బోటి పామరులకి అది ఒక వరం. కాదు పదమూడు సమగ్ర సాహిత్య వరాహాల పండుగ. కాదు కాదు. క్రీ.శ. 5వ శతాబ్దం నుండి ఆధునిక శకం దాకా సాగిన సాహితీ పరిశోధన. పరిశీలన. తెలుగు తెలిసిన ప్రతి మనిషికీ ఆరుద్ర అందించిన సాహిత్య వర ప్రసాదం.



ఐదేళ్ళకోసారి ఇండియాకి వెళ్ళిన ప్రతిసారీ, గుంటూరులోనూ విజయవాడలోనూ నవోదయా, విశాలాంధ్ర పుస్తకాల షాపుల్లో అడుగుతూనే వున్నాను, నాకు ఆరుద్రగారి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సెట్టు కావాలని. లేదు సార్, ప్రింట్‌లో లేదు అని జవాబు.

ముళ్ళపూడి వెంకటరమణగారిని కలిసినప్పుడు నా గోడు చెప్పుకున్నాను. ఆయన 'రామలక్ష్మిగారిని అడిగాను. ఆవిడ దగ్గరా కాపీలు లేవుట. తెలుగు అకాడమి వారు వేస్తారేమో అన్నారు. చూద్దాం' అన్నారు.

అలా ఎన్నో సంవత్సరాలుగా, ఆ పుస్తకాల కోసం ఎదురు చూస్తున్నాను. 2004 నాకు మా ఆస్టిన్ నగరంలో బంధు మిత్రుల సమక్షంలో షష్టిపూర్తి జరిగింది. స్నేహితులు శోభగారి నాన్నగారు నారాయణరావుగారు ఆ పదమూడు సంపుటాలూ బహుమతిగా పంపించారు. అంతేకాదు బెంగుళూరునించీ మా మరదలు, తెలుగు అకాడమీ ప్రచురించిన కొత్త సంపుటాలూ పంపించారు. నాకు గర్వకారణమేమిటంటే, అంత గొప్ప పుస్తకాలు, ఒకటి కాదు రెండు సెట్లు, నా దగ్గర ఇప్పుడు ఎంతో భద్రంగా దాచుకున్నాను. మొత్తం మూడు నెలల్లో చదివేయటమే కాకుండా, వారానికి కనీసం ఒకసారయినా, ఏదో అవసరం వచ్చి, ఆరుద్రగారి ధర్మమా అని, వాటిల్లో అక్కడా ఇక్కడా పేజీలు తిప్పుతూనే వున్నాను.

ఆరుద్రగారి పాటల్లో అంత్య ప్రాస వుంటుంది. అది కూడా చాల సహజంగా వుంటుంది. అది ఆయన ట్రేడ్ మార్క్. నాకు ఇంకా బాగా ఇష్టమయింది, ఆయన పదాల పొందిక. విన్న కొద్దీ, మనసు అలా ఉల్లాసంగా గాలిలో తేలిపోతుంది. తెలుగు భాషలోని తీయదనాన్ని ప్రతి పదంలోనూ చూపించిన, చూపించగలిగిన మహాకవి ఆరుద్ర.

ఆయన వ్రాసిన కొన్ని సినిమా పాటలు అలా మన హృదయాల్లో కలకాలం నిలిచిపోయాయి. విరహ గీతమయినా, విలాస గీతమయినా, ప్రణయమయినా, ప్రణవమయినా, భక్తి పాట అయినా, పద్యమయినా ఆయన బాణీ ఆయనదే ఆరుద్ర ముద్ర. పద లాలిత్యం, శబ్ద సౌందర్యం, తెలుగు భాషలోని తీయటి పరిమళం ఆయన పాటల్లో గుబాళిస్తూనే వుంటాయి.

'కొండ గాలి తిరిగిందీ, గుండె ఊసులాడిందీ, గోదావరి వరదలాగా కోరిక చెలరేగిందీ' మనతో ఊసులాడుతుంది. 'పుట్ట మీద పాలపిట్ట పొంగిపోయి కులికింది. గట్టు మీద కన్నెలేడి గంతులేసి ఆడింది. పట్టపగలు సిరివెన్నెల భరత నాట్యమాడింది. పట్టరాని లేత వలపు పరవశించి పాడింది. పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది. ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయిందీ' నాకు తెలిసినంతవరకూ, ఇన్ని సొగసులు ఘుమాయించిన తెలుగు పాట ఎంతవరకూ ఎవరూ వ్రాయలేదు. కళ్ళ ముందు గోదావరి అందంగా కనిపిస్తుంది. ఎన్నో నాజూకు తెలుగు పదాలు జానపద సౌందర్యంతో మన ముందు నాట్యమాడతాయి. ఇది తెలుగు సాహిత్యానికి ఆరుద్ర అందించిన అపురూప తాంబూలం. ఈ పాటలోని గొప్పతనాన్ని ఆనందించే అదృష్టం ఆయన అన్నట్టు మనకి ప్రాప్తం వుండటం వల్లేనేమో, ఆ పాట మన దగ్గరకి వచ్చి అలా కలకాలం మన మనసుల్లో నిలిచిపోయింది.

ఈ మౌనం, ఈ బిడియం మనకి చెలియ కానుకలయితే, తీయటి ఊహలు గుసగుసలాడుతుంటాయి. శ్రీరస్తు శుభమస్తు అంటూ పెళ్ళి పుస్తకాన్ని ప్రింటులో చూపించినా, ముత్యమంత పసుపుతో ముఖమంతా చాయ తెప్పించినా ఆయనకే చెల్లింది.

ఆరుద్ర నాస్తికుడయినా, ఆయన వ్రాసిన భక్తి పాటలు అజరామృతం.

మనసే అందాల బృందావనం, వేణు మాధవుని పేరే మధురామృతం అన్నారు.

'రాయినయినా కాకపోతిని రామ పాదము సోకగా' అన్న పదం, ఆస్తికులకే అందని గొప్ప భావం పలికిస్తుంది.

శ్రీరామ నామాలు శతకోటి అయినా, ఒక్కొక్క పేరు బహుతీపి అన్నారు.

చెంచులక్ష్మి సినిమాలో వ్రాసిన పాటల్లో, పద్యాల్లో పోతన మాధుర్యాన్ని ఆరుద్రలో చూస్తాం మనం. మహానటుడు రంగారావుకి మాధవపెద్ది సత్యం పాడిన, ఎవడురా విష్ణుండు, ఎవడురా జిష్ణుండు పద్యం ఎన్ని సార్లు విన్నా తనివి తీరదు నాకు.

ఏమి వ్రాసినా ఆయన దృష్టిలో 'మానవుడే మహనీయుడు'

డబ్బింగ్ సినిమాలకి పాటలు వ్రాసినా, అవే ఒరిజినల్స్ అని మీరు ఘంటాపథంగా వాదించటానికి అవకాశ మిచ్చిన రచయిత ఆరుద్ర. వాటిల్లో నాకు ఎంతో ఇష్టమైనవి, ఆహ్ అనే సినిమాని తెలుగులో తీసిన ప్రేమలేఖలు అనే రాజ్‌కపూర్ చిత్రంలోని ఆయన రచనలు.. ఆ పాటల్లోని గొప్పదనం చూడండి.

'పందిట్లో పెళ్ళవుతున్నాదీ, కనువిందవుతున్నాదీ, నటనమే ఆడెదనూ... '

'పెండ్లి కుమార్తె పూజాఫలమూ చేతికందేనూ
గోరింటాకూ కోయగబోతే గోళ్ళు కందేనూ!'

'కంటికి రెప్ప మన పుట్టిల్లూ,
కానీ దానికి ఈ రుణమే చెల్లు'

'ఎడబాటంటే ఎదలో ముల్లు'

'నీ పేరు విన్నా, నీ రూపు కన్నా, ఉయ్యాల లూగుమది సై సై సై'

'ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం'

అలాగే మురిపించే మువ్వలు అనే డబ్బింగ్ చిత్రానికి ఆయన వ్రాసిన 'నీ లీల పాడెద దేవా' అనే పాట. ఆ పాట వల్లే ఆ సినిమా ఆంధ్రదేశంలో ఆడిందంటే ఆశ్చర్యం లేదు. జానకిని ఒక గొప్ప గాయనిగా నిలబెట్టిందీ ఆ పాటేనేమో.

మూడు పదాల్లో, మూడు చెరువుల నీరు త్రాగించి, మనల్ని ముచ్చటగా మురిపించిన కవి అక్షరాలా మూడక్షరాల కవి ఆరుద్ర. ఆ పదాలు కూనలమ్మ పదాలు.

చిన్ని పాదములందు
చివరి ప్రాసల చిందు
చేసె వీనుల విందు.

అంతే కాదు.... పెను సమాసములున్న
పెద్ద వృత్తము కన్న
చిన్న పదమే మిన్న... అన్నారాయన.

మచ్చుకి నాకు నచ్చిన కొన్ని కూనలమ్మ పదాలు.

ఆశ పెరిగిన నాడు
అహము పెరిగిన వాడు
తనకు తానే కీడు - ఓ కూనలమ్మా!

తమలపాకులు నములు
దవడతో మాట్లాళు
తానె వచ్చును తమిళు - ఓ కూనలమ్మా!

భర్త తోడను సీత
పట్టు పట్టుట చేత
అట్లు తగలడె రాత - ఓ కూనలమ్మా!

అలాగే ఆయన ఇంటింటి పజ్యాలు.

మాటవరసకి మా ఇంట్లో నేను యజమాన్నే అంటూ.. ఇలా అంటారాయన.

స్కూలుకి వెళ్ళే పిల్లలే ముందు చెయ్యాలి స్నానం
బాత్రూం క్యూలో నాన్నదే కడపటి స్థానం
అమ్మాల్నావిడ స్కూల్బస్సెక్కించాలి ముందు
పిమ్మటే ఎక్కిస్తుంది మత్తైజమ్మా బొందు.

తాబేలు గురించి వ్రాస్తూ...

దీనికింకో పేరు కూడా వుంది కూర్మం
దాని పైభాగం ఇంటి కప్పు చూర్మం
అట్టడుగున వుంటుంది మెత్తటి చర్మం
అచ్చోట తిరగేసి కొడితే దాని ఖర్మం.

ఇంటి పక్కన లౌడ్ స్పీకరు 'శ్రోతలు కోరని రికార్డులు' వినిపిస్తుంటే...

నువ్వే ఎలక్ట్రికల్ ఇంజనీరువైతే ఉండదులే ఈ పిచ్చి

నవ్వుతూ వెళ్ళి ఆపెయ్యొచ్చు ఊరంతటి మెయిన్ స్విచ్చి.

'ఎరువిచ్చిన బుక్కు, మళ్ళీ చూడ్డం కూడా గొప్ప లక్కు'

అరవ్వాడు తింటాడు ఇడ్డెన్లూ వడ

బెంగాలీవాడు తింటాడు జిలేబీ సింగడ

తెలుగువాడు తింటాడు పెసెరట్టూ ఉప్మా

ఎస్కిమోలు తినేవి ఏవేమిటి చెప్మా!

ఇలా సాగుతాయి ఆరుద్ర ఇంటింటి పజ్యాలు.

'1965 ఏప్రిల్ నెల నుండి నవంబర్ నెల దాకా ఎనిమిది నెలలు క్రమం తప్పకుండా ఆసాంతం రచన చేసి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సంపుటాలను అచ్చుకివ్వటంలో నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. ఆ టెన్షన్ వల్ల రావలసిన అన్ని రుగ్మతలూ వచ్చాయి. అయినా ప్రజలకు ప్రకాశకులతో పాటు వాగ్దానం చేసింది పన్నెండు సంపుటాలు కనుక ఆ సంఖ్యను పూర్తిచేయాలని నిశ్చయించాను. అది 1968 ఫిబ్రవరి నాటికిగాని పూర్తి చేయలేక పోయాను' అని ఆరుద్రగారు తన మనవి మాటల్లో చెప్పుకున్నారు.

తెలుగులో పిహెచ్‌డీ చేసే వాళ్ళకి కూడా ఎంతో ఉపయోగపడుతున్న గొప్ప గ్రంథాలు 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'.

మన తెలుగుకీ ద్రవిడ భాషకీ వున్న సంబంధాలనీ, తెలుగు భాష పుట్టు పూర్వోత్తరాలనీ నేను పూర్తిగా తెలుసుకున్నది ఈ పుస్తకాల ద్వారానే. ఆరుద్రగారు ప్రాణం పెట్టి వ్రాసిన ఈ పుస్తకాలు ప్రతి తెలుగు వారి ఇంట్లోనూ తప్పనిసరిగా వుండవలసినవి.

'తెలుగు జాతికి గర్వకారణం ఆరుద్ర. ఈ వాఙ్మయ చరిత్రకారునికి ఇవ్వవలసినంత ఖ్యాతి మనం ఇవ్వలేదేమో అనిపిస్తుంది. ఇదే తదితర ఏ భాషలో వ్రాసినా, ఆయన్ని అపూర్వ మేధావిగా గ్రహించేవారు. ప్రపంచంలో, వివిధ భాషా సాహిత్యాలలో ఎక్కడా ఒక్క చేతిపై ఇంత సాహిత్య చరిత్ర వ్రాసిన దాఖలాలు లేవు' అన్నారు జస్టిస్ చిన్నపురెడ్డి.

'చదువుకొన్న ప్రతి ఆంధ్రుడూ ఈ కానుకను రెండు చేతులతోనూ పుచ్చుకోవాలని నా కోరిక' అన్నారు పి.వి. రాజమన్నారు.

తన సాహిత్యం ద్వారా, మన హృదయాల్లో రుద్ర పీఠం వేసిన ఆరుద్ర మాత్రం చిరంజీవి.